www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:72 WEDNESDAY ,JULY 22,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 72 బుధవారం 22 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-

## ఆగస్టు 30లోగా తనిఖీలు పూర్తి కావాలి

**బీసీ గురుకులాలపై మంత్రి పొన్నం ఆదేశాలు**



2

- విద్యార్థులకు విద్యతో పాటు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమన్న పొన్నం
- ప్రతి ఆర్‌సీవో కచ్చితంగా వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశం






## వరంగల్ జువెలరీ షాపులపై బి ఐ ఎస్ దాడులు

✦పూర్తి సమాచారం రేపటి ధర్మఘంట సంచికలో



## ఎల్ నినో సవాళ్లకు

**తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళిక**

హంసకలం వార్త : ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే మిగతా2లో

## మోదీ నివాసం వద్ద ధర్నా చేస్తున్న

**రాహుల్ గాంధీతో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ భేటీ**

- ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ భారీ నిరసన
- ఆందోళనలో రాహుల్ గాంధీని కలిసిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- నీట్ అక్రమాలపై ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్
- ర్యాలీలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, ఖర్గే, ఇతర ముఖ్య నేతలు

హంసకలం వార్త : నీట్ పరీక్ష అక్రమాలు, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన నిరసన కార్యక్రమం ఆసక్తికర పరిణామాలకు వేదికైంది. లోక్ కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద ధర్నా చేస్తున్న రాహుల్ మిగతా2లో

## నేత్రపర్వంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం..

హంసకలం వార్త : బల్కంపేట ఎల్లమ్మ తల్లి దివ్య కల్యాణ మహోత్సవం మంగళ వారం ఉదయం నుంచే వేదమంత్రో చ్ఛారణలు, మంగళవాయి ద్యాల నడుమ వైభవంగా ప్రారంభమైంది. ఉదయం 11:59 గంటల సుముహూ ర్తానికి అమ్మవారి కల్యాణాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య నిర్వ హించనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. మిగతా2లో






## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు

- దేవాదుల నుంచి నీళ్లు రాక రైతులు నష్టపోయారన్న హరీశ్
- దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా ఉత్తమ్ కు తెలియదని ఎద్దేవా
- నీళ్ల నిర్వహణపై ప్రభుత్వానికి అవగాహన లేదని విమర్శ

హంసకలం వార్త : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను నమ్మి దేవాదుల ప్రాజెక్టు కింద నారుమడులు పోసుకున్న రైతులు ఇప్పుడు నీళ్లు లేక తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా2లో



## పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్న హరీశ్ రావు

హంసకలం వార్త : ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా – సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత మిగతా2లో



## ఫేక్ యాప్స్ మోసం

**నకిలీ స్టాక్ మార్కెట్ యాప్స్ కేసులో గూగుల్ ఇండియా హెడ్‌పై కేసు**

- –హైదరాబాద్‌లో ముగ్గురు
- –బాధితులు రూ.48 లక్షలకు పైగా నష్టం
- –ప్లే స్టోర్‌లోని ఫ్రాడ్ యాప్స్‌ను తొలగించకపోవడమే కారణం
- –ఐటీ చట్టం, బీఎన్ఎస్ సెక్షన్ల కింద చర్యలు చేపట్టిన పోలీసులు

హంసకలం వార్త : హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ సైబర్ మోసం కేసుల్లో గూగుల్ ఇండియా కంట్రీ హెడ్ ప్రీతి లోబానా పేరును పోలీసులు చేర్చారు. గూగుల్ ప్లే స్టోర్ వేదికగా చలామణి అవుతున్న నకిలీ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల ద్వారా జరిగిన మోసాలకు సంబంధించి నమోదైన మిగతా2లో

## ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలి



హంసకలం వార్త : రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పొడిగింపు మళ్లీ ఉండదని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలని నగరంలోని ఓటర్లకు సూచించారు. ఫామ్ తీసుకున్న ఓటర్లు ఆగస్టు 3వ తేదీ వరకు గడువు ఉందని చెబుతున్నారని.. కానీ వీటినన్నింటిని డిజిటలైజేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సర్ ఫామ్‌లు మిగతా2లో



## 'సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు'..

**కాక్రోచ్ పార్టీ ర్యాలీకి కేటీఆర్ మద్దతు**

2

- ✦విద్యార్థులపై పోలీసు చర్యలను ఖండించిన కేటీఆర్
- ✦పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని వ్యాఖ్య
- ✦విభేదాల గొంతు నొక్కే ప్రయత్నం ఆపాలంటూ కేంద్రానికి చురకలు
- ✦విద్యార్థులకు సంఘీభావం ప్రకటించిన బీఆర్ఎస్ నేత
- ✦ఈ ప్రతిఘటనను పది నెలల క్రితమే ఊహించినట్లు వెల్లడి

## నీట్ లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరం



2

- నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ అంశంపై సీబీఐ దర్యాప్తు వేగంగా జరుగుతోందన్న రఘునందన్ రావు
- ఈ అంశంపై పార్లమెంట్‌లో సమాధానం ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని వెల్లడి

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు



- –భర్తలు పనిచేసే సంస్థలకు కొందరు భార్యలు ఫిర్యాదు చేస్తున్నారన్న సుప్రీంకోర్టు
- దీని వల్ల భర్తలు ఉద్యోగాలు –కోల్పోయే అవకాశం ఉందని వ్యాఖ్య
- –జీవిత భాగస్వామి జీవనోపాధిని దెబ్బతీయడం తీవ్రమైన అంశమన్న సుప్రీంకోర్టు

హంసకలం వార్త :వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మిగతా2లో

# నేత్రపర్వంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం..

మంత్రులతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు: మంత్రి కొండా సురేఖ**

రాష్ట్ర ప్రజలు శాంతి, సుభిక్షం, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. భక్తులతో కలిసి మంత్రి మొక్కులు చెల్లించారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలు కల్పించిందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

**తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండాలని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు.

**ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న సీఎం సతీమణి..**

అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డి కూడా బల్కంపేట ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించి రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. ఆలయ అర్చకులు ఆమెకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.




## మోదీ నివాసం వద్ద ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీతో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ భేటీ

నిరసన ఉద్రిక్తతల నడుమ చోటుచేసుకున్న ఈ ఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై ప్రధాని నరేంద్ర మోదీ జవాబుదారీతనం వహించాలని, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మంగళవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా సహా పలువురు ఎంపీలు, నాయకులు లోక్ కళ్యాణ్ మార్గ్ లోని ప్రధాని నివాసం వైపు ర్యాలీగా బయలుదేరారు. అయితే, పోలీసులు భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్, నేరుగా రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి ఆయనతో మాట్లాడారు. వారిద్దరి మధ్య ఏం చర్చ జరిగిందనే వివరాలు వెంటనే తెలియరాలేదు. అయినప్పటికీ, ఒకవైపు నిరసన జరుగుతుండగానే ప్రభుత్వ ప్రతినిధి, ప్రతిపక్ష నేత మాట్లాడుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. వర్షాకాల సమావేశాల నేపథ్యంలో పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ తమ ఆందోళనను పార్లమెంటు నుంచి వీధులకు విస్తరించింది. నీట్ వ్యవహారంలో ప్రధాని మోదీ నుంచి సమాధానం రాబట్టే వరకు తమ పోరాటం ఆగదని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఈ నిరసనతో ఢిల్లీలోని కీలక ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# ఆగస్టు 30లోగా తనిఖీలు పూర్తి కావాలి

తెలంగాణ రాష్ట్రంలోని బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థుల వసతులపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కఠిన నిబంధనలు విధించారు. బీసీ గురుకుల రీజనల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌లతో (ఆర్‌సీవో) కీలకమైన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన... రాబోయే ఆగస్టు 30వ తేదీ నాటికి రాష్ట్రంలోని అన్ని బీసీ గురుకుల విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి తనిఖీలను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పూర్తి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ విధివిధానాల్లో భాగంగా ప్రతి ఆర్‌సీవో కచ్చితంగా వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి, కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను నేరుగా సందర్శించాలని మంత్రి ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించిన ఆయన, స్వయంగా తాను కూడా ప్రతి నెలా కనీసం 15 గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ఎక్కడా ఫుడ్ పాయిజనింగ్ వంటి ఘటనలు జరగకుండా ఆహార నాణ్యతపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. చదువుతో పాటు క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమిస్తూ, ఒత్తిడి తగ్గించేందుకు సైకాలజిస్టులతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. మరొక వైపు సొంత భవనాలు లేని గురుకులాలకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మూసీ గురుకులానికి సొంత భవన నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు కేటాయించే నిధుల్లో ఆరు శాతాన్ని అత్యవసర మరమ్మతులకు వినియోగించుకునేలా అనుమతించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి గురుకులంలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థుల భాగస్వామ్యంతో విస్తృతంగా మొక్కలు నాటించి వాటిని సంరక్షించే బాధ్యతలను కూడా వారికి అప్పగించాలని ఆర్‌సీవోలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.

# ‘సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదు’..

నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న వేళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. యువత ఆవేదనను పట్టించుకోకపోతే దేశంలో ‘జెన్-జెడ్’ ఉద్యమం తప్పదని తాను పదినెలల కిందటే చెప్పానని గుర్తుచేశారు. ఢిల్లీలో జరిగిన నిరసనల తర్వాతైనా కేంద్రం జవాబుదారీతనం చూపించి, విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం, బాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది లాఠీలతో కాదని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు కల్పించిందని పేర్కొన్నారు. విభేదాల గొంతు నొక్కే ప్రయత్నాలను కేంద్రం వెంటనే ఆపాలని, జవాబుదారీతనం కోసం పోరాడుతున్న విద్యార్థులకు తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇదే అంశంపై తెలంగాణ కాంగ్రెస్ కూడా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ పాల్గొన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పొన్నం డిమాండ్ చేశారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తూ, పోలీసుల చర్యలను ఖండించారు.

## నీట్ లీకేజీ వ్యవహారం అత్యంత బాధాకరం

నీట్‌తో పాటు ఏ ప్రజా సమస్యపై అయినా పార్లమెంట్‌లో సమగ్రమైన సమాధానం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే పార్లమెంట్ సమావేశాలు కేవలం నిబంధనల ప్రకారమే సాగుతాయని, విపక్షాల ఆలోచనలకు అనుగుణంగా జరగవని తేల్చిచెప్పారు. జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేసి ఫోటోలు దిగాలనే ఉద్దేశంతోనే విపక్షాలు సభను వాయిదా వేయిస్తున్నాయని ఆయన విమర్శించారు. సభా నిబంధనల ప్రకారం నీట్ అంశంపై చర్చించేందుకు స్పీకర్ అంగీకరించినప్పటికీ, జీరో అవర్‌ను రద్దు చేసి ఇప్పుడే చర్చ పెట్టాలంటూ విపక్షాలు పట్టుబట్టడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు ఇప్పటికే నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు కూడా వెల్లడించామని గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో చట్టసభను ముట్టడిస్తామంటే ఏ ప్రభుత్వమైనా భద్రత దృష్ట్యా నిరసనకారులను అడ్డుకుంటుందని, దానిని వివాదం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. అలాగే అయోధ్య విరాళాల చోరీ ఉదంతంతో బీజేపీ లేదా ఆర్ఎస్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ఈ చోరీ కేసుపై సిట్ లోతుగా విచారణ జరుపుతోందని తెలిపారు. ఆలయంలో పనిచేసే ఒక వ్యక్తి దురాశతో చేసిన తప్పును తీసుకొచ్చి ఒక పార్టీకి ఆపాదించడం దుర్మార్గమని మండిపడ్డారు. వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికలు రాబోతున్నందునే, రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు బీజేపీపై లేనిపోని ఆరోపణలు గుప్పిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలి

మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలని నగరంలోని ఓటర్లకు సూచించారు. ఫామ్ తీసుకున్న ఓటర్లు ఆగస్టు 3వ తేదీ వరకు గడువు ఉందని చెబుతున్నారని.. కానీ వీటినన్నింటిని డిజిటలైజేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సర్ ఫామ్‌లు సాధ్యమైనంత త్వరగా బీఎల్‌వోలకు అందించాలని ప్రజలకు ఆయన వివరించారు. ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారు.. విద్యార్థులపై దాడి అమానుషం: మూడేళ్లయినా.. నో ‘కేవైసీ’! చివరి రోజు వరకు ఆగితే.. డిజిటలైజేషన్ చేసే సమయంలో సర్వర్ డౌన్ అయ్యే అవకాశం ఉందని అన్నారు. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలు ఐదారుసార్లు ఇంటింటికి వెళ్లారని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో 9.59 శాతం మంది ఓటర్లు ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపారని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 43 శాతం ఎన్యూమరేషన్ ఫామ్‌లు రిసీవ్ చేసుకుని.. వాటి వివరాలను డిజిటలైజ్ చేశామని పేర్కొన్నారు. ఓటరును భయపెట్టి, ఎన్యూమరేషన్ ఫామ్ ఇవ్వకుండా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ హెచ్చరించారు. ఓటు హక్కుకు, సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వివరించారు. మీ ఓటు హైదరాబాద్‌లో ఉన్నా లేక గ్రామాల్లో ఉన్నా సంక్షేమ పథకాలు ఎక్కడికి పోవని అన్నారు. SIR ప్రక్రియలో నిర్లక్ష్యంగా వహించిన ఓ ~~బూజు~~ ~~బాను~~ ఇప్పటికే సస్పెండ్ చేశామని గుర్తు చేశారు. ఇంకొంత మంది బీఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. బీఎల్‌వోలు ఎలా పని చేస్తున్నారో చెక్ చేయడానికి విజిలెన్స్ అధికారులు ఫీల్డ్‌లో చెక్ చేస్తున్నారని ఆర్వీ కర్ణన్ వివరించారు.

## భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు

అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. “ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం” అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.

## ఎల్ నినో సవాళ్లకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళిక

ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలంలోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

## పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్న హరీశ్ రావు

గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్ రావును మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి మాటలు నమ్మిన రైతులు తీవ్రంగా నష్టపోయారు

మంత్రి మాటలు నమ్మి నాట్లు వేసుకుంటే, ఇప్పుడు నీళ్లు రాక ఆ నారుమడులన్నీ ముదిరిపోయి పుచ్చిపోయే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. దేవాదుల నుంచి 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, 22 రిజర్వాయర్లను నింపి ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం డైలాగులు కొట్టిందని విమర్శించారు. అసలు ఆ నీళ్ల మంత్రికి దేవాదుల కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా తెలియదని హరీశ్ ఎద్దేవా చేశారు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్ల నిర్వహణపై కనీస అవగాహన లేదని విమర్శించారు. దేవాదుల అనేది బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టు అని, ఆ విషయం కూడా కాంగ్రెస్ నాయకులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం విషయంలో కుంటిసాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసిన ప్రభుత్వం... మరి దేవాదుల వద్ద నీళ్లు ఎత్తడానికి ఏం అడ్డంకి వచ్చిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. తాను ప్రెస్ మీట్ పెట్టి నిలదీసిన తరవాతే మంత్రులు హెలికాప్టర్ వేసుకుని అక్కడికి పరిగెత్తారని తెలిపారు. రేపే మోటార్లు నడుపుతామని మంత్రులు ఒకరిని మించి ఒకరు ఉపన్యాసాలు దంచారని, కానీ ఎనిమిది రోజులు గడిచినా ఇప్పటికీ 10 మోటార్లు కూడా స్టార్ట్ కాలేదని ఎద్దేవా చేశారు. మంత్రులు వెళ్లిన రోజు ఏడు మోటార్లు నడిస్తే, తెల్లారేసరికి అవి ఐదుకి పడిపోయాయని, కాంగ్రెస్ మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయే తప్ప చేతల్లో శూన్యమని అన్నారు.

# ఫేక్ యాప్స్ మోసం

గూగుల్ ప్లే స్టోర్ వేదికగా చలామణి అవుతున్న నకిలీ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల ద్వారా జరిగిన మోసాలకు సంబంధించి నమోదైన మూడు వేర్వేరు కేసుల్లో ఆమెను సహ నిందితురాలిగా పేర్కొంటూ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మోసాల కారణంగా బాధితులు మొత్తం రూ. 48 లక్షలకు పైగా నష్టపోయినట్లు నిర్ధారణ అయింది. ఈ కేసులు జూన్ చివరి వారం నుంచి జూలై మధ్య కాలంలో నమోదయ్యాయి. సంతోష్‌నగర్‌కు చెందిన ఒక 69 ఏళ్ల వృద్ధుడు, ఫేస్‌బుక్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫొటోతో కూడిన ప్రకటన చూసి మోసపోయారు. వాట్సాప్ ద్వారా పరిచయమైన ఓ మహిళ సూచన మేరకు సదరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రూ.24.37 లక్షలు కోల్పోయారు. అదేవిధంగా, ఆదిభట్లకు చెందిన 40 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగి మరో నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా రూ.17 లక్షలు, ఎర్రగడ్డకు చెందిన 71 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి రూ.7 లక్షలు నష్టపోయారు. ఈ మోసపూరిత యాప్‌లను గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించాలని గూగుల్ సంస్థకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు సైబర్ క్రైమ్ అధికారులు వెల్లడించారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 79(3) ప్రకారం, ప్రభుత్వ ఏజెన్సీలు ఆదేశించినా అక్రమ కంటెంట్‌ను తొలగించడంలో విఫలమైతే సదరు మధ్యవర్తిత్వ సంస్థలు చట్టపరమైన బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ నిబంధన ఆధారంగానే గూగుల్ ఇండియా హెడ్‌పై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ కేసుల్లో ప్రధాన నిందితులతో పాటు ప్రీతి లోబానాపై ఐటీ చట్టం మరియు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద మోసం, ఫోర్జరీ వంటి అభియోగాలతో కేసులు నమోదు చేశారు. ఈ పరిణామాలపై గూగుల్ సంస్థ నుంచి లేదా ప్రీతి లోబానా నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# సంపాదకీయం

## డీలిమిటేషన్‌ను అడ్డుకుంటే దక్షిణాదికి ద్రోహమే!

ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశ ప్రజాస్వామ్యానికి, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికికి అత్యంత కీలకమైనవి. గత సమావేశాల్లో రాజకీయ పంతాలకే ప్రాధాన్యమిచ్చిన కాంగ్రెస్, తృణమూల్, డీఎంకే, సమాజ్‌వాదీ వంటి విపక్షాల సంకుచిత వైఖరి వల్ల 131వ రాజ్యాంగ సవరణ-- డీలిమిటేషన్ బిల్లు ఆగిపోయింది. ప్రస్తుత సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును అధికారిక ఎజెండాలో పెట్టనప్పటికీ, సప్లిమెంటరీ బిల్లు రూపంలో తెచ్చే అవకాశాలు ఉన్నాయి. విపక్షాలు మళ్లీ ఏకతాటిపైకి వచ్చి అడ్డుకోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని పాటిస్తోంది. లోక్‌సభలో శివసేన షిండే గ్రూపునకు చెందిన ఆరుగురు ఎంపీలకు విడిగా గ్రూప్ హోదా దక్కడం, తృణమూల్ కాంగ్రెస్ విలీనవర్గం ఆమోదం పొంది ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు రావడం, శరద్ పవార్ వర్గం కూడా బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే దిశగా అడుగులు వేస్తుండటం, విపక్ష కూటమిలోని డీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉండాలనే యోచనలో ఉండటం వంటి పరిణామాలు సభలో సరికొత్త రాజకీయ చిత్రపటాన్ని ఆవిష్కరించాయి. తాజా రాజకీయ లెక్కల ప్రకారం.. షిండే గ్రూప్, టీఎంసీ శకలాలు, స్వతంత్రులు, చిన్న పార్టీలు కలుపుకుని ఎన్డీఏ వైపు 315 నుంచి 319 మందిని దాటి బలంగా ఉండటంతో విపక్షాల పాత వ్యూహాలు ఇక సాగవు జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్న ఆందోళన పాతదే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం, లోక్‌సభ స్థానాల కేటాయింపు జనాభా ప్రాతిపదికన జరగాలి. 1976లో ఇందిరాగాంధీ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1971 జనాభా లెక్కల ఆధారంగా సీట్ల సంఖ్యను 2000 సంవత్సరం వరకు స్తంభింపజేశారు. 2001లో వాజపేయి హయాంలో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకొని, కుటుంబ నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదని గట్టిగా వాదించి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 84వ రాజ్యాంగ సవరణలో కీలకపాత్ర వహించారు. తద్వారా ఈ స్తంభనను మరో 25 ఏళ్లు-- 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల వరకు పొడిగించారు. ఆ చారిత్రక చొరవ వల్లనే గత పాతికేళ్లుగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ బలం, జాతీయ స్థాయి ప్రాధాన్యం రక్షించబడుతూ వచ్చాయి. ఆర్టికల్ 81(3) నిబంధన ప్రకారం, 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగా ఉన్న సీట్ల స్తంభన 2026తో ముగుస్తుంది. తదుపరి జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్ అనివార్యం అవుతుంది. 2011 జనాభా లెక్కలను లేదా భవిష్యత్ జనాభా గణాంకాల ఆధారంగా సీట్ల పునఃకేటాయింపు చేస్తే ఘోరమైన అసమతుల్యత ఏర్పడుతుంది. జనాభా విస్ఫోటనంతో ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, జనాభాను క్రమశిక్షణతో అదుపు చేసిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల సీట్ల శాతం జాతీయ స్థాయిలో దారుణంగా పడిపోతుంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పాత 543 స్థానాల పరిమితిలోనే పునర్విభజన చేస్తే, తమిళనాడు సీట్లు 39 నుంచి 32కి, కేరళ సీట్లు 20 నుండి 15కి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది సమాఖ్య స్ఫూర్తికే తీరని విఘాతం. ఈ భౌగోళిక-- రాజకీయ అసమతుల్యతను నివారించడానికి ఎన్డీఏ ప్రతిపాదించిన న్యాయబద్ధమైన రాజ్యాంగ రక్షణ కవచం-- లోక్‌సభ మొత్తం స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850 లేదా 50శాతం అదనపు స్థానాలకు పెంచడం అనే మోడల్-- ఓడిపోయింది. కేంద్రం తెచ్చిన 'ప్రొపోర్షనల్ ఇంక్రీజ్ మోడల్' (సమాన నిష్పత్తి పెంపుదల విధానం) ప్రకారం జాతీయ స్థాయిలో ఏ రాష్ట్రానికి ప్రస్తుతం ఎంత శాతంలో ఎంపీ సీట్ల ప్రాతినిధ్యం ఉందో, పార్లమెంట్ విస్తరణ తర్వాత కూడా అదే శాతం ప్రాతినిధ్యం కొనసాగుతుంది. అంటే ఎవరి జాతీయ వాటా తగ్గకుండా అందరికీ సీట్లు పెరుగుతాయి. ఈ బిల్లు ప్రకారం, విస్తరణ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలో 17 నుంచి 26 సీట్లకు, తమిళనాడులో 39 నుంచి 59 సీట్లకు పెరుగుతాయి. ప్రస్తుతం దక్షిణాదికి ఉన్న 129 లోక్‌సభ స్థానాలు ఏకంగా 195 స్థానాలకు పెరుగుతాయి. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల మొత్తం ప్రాతినిధ్యం దాదాపు 24 శాతంగానే స్థిరంగా, ఉత్తరాది రాష్ట్రాల పెరిగిన జనాభాకు ప్రాతినిధ్య న్యాయం జరుగుతుంది. అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించిన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యానికి ఎలాంటి భంగం కలగదు. ఇది అసలైన 'విన్--విన్' పరిష్కారం. కానీ కాంగ్రెస్, దాని విపక్ష కూటమి పట్టుదలకు పోయి వాకౌట్ చేయడంతో, మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లేక బిల్లు ఆగిపోయింది. ఈ ఓటమిపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. విపక్షాల బాధ్యతారాహిత్య చర్య వల్ల దక్షిణాది సాధించింది ఏమీ లేదనే సత్యం ప్రజలకు అర్థమైంది. బహిరంగంగా దక్షిణాది ప్రయోజనాల గురించి మాట్లాడే కాంగ్రెస్, డీఎంకే వంటి పార్టీలు రాజకీయంగా మాత్రం దక్షిణాదిని రక్షించే ఏకైక నిర్మాణ వ్యవస్థను ధ్వంసం చేయడం.. వారి అంతర్గత వైరుధ్యాన్ని బయటపెట్టింది. కేవలం గుడ్డి వ్యతిరేకతతో, దేశ ప్రయోజనాలను, ముఖ్యంగా దక్షిణాది ప్రయోజనాలను, పణంగా పెట్టడానికి కూడా కాంగ్రెస్ వెనుకాడటం లేదు. దీనికి భిన్నంగా తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రాంతీయ ప్రయోజనాలతో పాటు జాతీయ సమగ్రతను కాపాడేలా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించింది. గత సమావేశాల ఓటమినీ, తదనంతర పరిణామాలను నేపథ్యంగా ఉంచుకుని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు కేవలం ఆర్థిక కేటాయింపులకే పరిమితం కాకుండా, దేశ సమాఖ్య స్ఫూర్తిని రక్షించే డీలిమిటేషన్ సవరణపై పునఃచర్చకు వేదిక కావాలి. విపక్షాలు తమ పాత పంతాలను పక్కనబెట్టి, జాతీయ సమ్మతిని సాధించడానికి ముందుకు రావాలి. ఈ సెషన్‌లో ప్రధానంగా మూడు అంశాలపై ఉభయసభల్లో చర్చ జరగాలని తెలుగుదేశం పార్టీ కోరుకుంటోంది. ఒకటి, 50శాతం ప్రొపోర్షనల్ సీట్ల పెంపుదలను రాజ్యాంగ సవరణ బిల్లులో అంతర్భాగంగా చేర్చి, దక్షిణాది రాష్ట్రాల జాతీయ ప్రాతినిధ్య శాతం తగ్గదని చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వడం. రెండు, నియోజకవర్గాల సంఖ్య పెరగడం వల్ల ప్రతి ఎంపీ పరిధిలోని జనాభా భారం తగ్గి, ప్రజలకు-- ప్రజాప్రతినిధికి మధ్య దూరం తగ్గడం. మూడు, 2023లో ఆమోదించిన 'నారీ శక్తి వందన్ అధినియం' అమలు కావాలంటే చట్టసభల్లో 33శాతం స్థానాలు మహిళలకు దక్కాలంటే, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా.

# వాంగ్‌చుక్... ఆ గళాలన్నీ గప్‌చుప్!





ఆ ఇరువురూ ధర్మ యోధులు. పాలనావ్యవస్థలో అవినీతికి, అసమర్థతకు వ్యతిరేకంగా ప్రాణత్యాగానికి సాహసించి నిరవధిక నిరాహార దీక్షలతో ప్రభుత్వాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీరులు. వారి ధర్మ పోరాటాల మధ్య కాల విరామం పదిహేను సంవత్సరాలు మాత్రమే. వాటి కథలు భిన్నమైనవి. దేశ రాజకీయాలలో, ప్రజా దృక్పథాల్లో ఒక స్పష్టమైన మార్పును అవి సూచిస్తున్నాయి. ఆ నైతిక యోధులలో ఒకరు అన్నా హజారే. 1990ల్లో మహారాష్ట్రలో సమాచార హక్కు చట్టం కోసం, అవినీతిపరులైన అధికారులపై చర్యలను డిమాండ్ చేస్తూ ఆయన అనేక ఆందోళనలు, నిరాహార దీక్షలు నిర్వహించారు. వాటికి పరాకాష్ఠ జన్‌లోక్‌పాల్ ఉద్యమం. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని అరికట్టేందుకు లోక్‌పాల్ వ్యవస్థను నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5, 2011న ఆయన నిరాహారదీక్షకు ఉపక్రమించారు. నాలుగు రోజుల పాటు సాగిన ఆ పోరాట దీక్ష, జన్ లోక్‌పాల్ బిల్లు ముసాయిదా రూపకల్పనకు ఒక సంయుక్త సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో ముగిసింది. తిరిగి అదే ఏడాది ఆగస్టు 16న న్యూఢిల్లీలోని సుప్రసిద్ధ రామ్‌లీలా మైదానంలో అన్నా మళ్లీ నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఆయన డిమాండ్లకు అనుకూలంగా పార్లమెంటు ఒక తీర్మానాన్ని ఆమోదించడంతో అన్నా దీక్ష పన్నెండవ రోజున (ఆగస్టు 28) ముగిసింది. లోక్‌పాల్ కోసం నిర్వహించిన దీక్షలతో ఆయన ఆసేతు హిమాచలం ఆబాలగోపాలానికి సుపరిచితుడు అయ్యారు. అన్నా హజారే డిమాండ్ సాపేక్షంగా నిరపాయ కరమైనది. అవినీతిని నిర్మూలించేందుకు గట్టిచర్యలు చేపట్టేందుకు జాతీయస్థాయిలో స్వతంత్ర లోక్‌పాల్ వ్యవస్థను సృష్టించాలనేది ఆయన డిమాండ్. అవినీతి అనేది చాలామంది పాల్పడుతున్నదే కదా అనే ఉదాసీనత దేశంలో అవినీతి పెచ్చరిల్లిపోయేందుకు దారితీస్తోంది. అందరూ చట్టోల్లంఘనకు పాల్పడుతున్నప్పుడు తాను ఒక్కణ్నే చట్టానికి కట్టుబడి ఉండడం వల్ల ప్రయోజనమేముంది అన్న ఆలోచనతో అత్యధికులు అవినీతికి కారకులవుతున్నారు. పైగా, అన్నాహజారే నిరవధిక నిరాహార దీక్షకు పూనుకున్న సందర్భంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అనేక కుంభకోణాలతో అప్రతిష్ఠ పాలయివున్నది. ప్రభుత్వ ప్రమేయమున్న ప్రతి వ్యవహారంలోను అవినీతి చోటుచేసుకున్నదని ప్రజలు విశ్వసించిన కాలమది. దీంతో, అన్నా ఆందోళనకు అశేష ప్రజల మద్దతు లభించింది. రామ్‌లీలా మైదానంలో అన్నా హజారే నిరాహార దీక్షకు మద్దతు తెలిపేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి రావడాన్ని టెలివిజన్ చానెల్స్ ప్రత్యక్ష ప్రసారం చేశాయి. వృత్తి విధులను నైతిక నిష్ఠతో నిర్వహించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ లాంటి వారే కాకుండా యోగా గురువు బాబా రామ్‌దేవ్ లాంటివారు కూడా అన్నా ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అవినీతిని తాము ఎంత చిత్తశుద్ధితో వ్యతిరేకిస్తుందీ చాటుకోవడానికి అన్నా ఉద్యమానికి మద్దతునివ్వడం ఒక ప్రయోజనకరమైన మార్గమని అనేకానేకమంది విశ్వసించారు. అయితే, అన్నా ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన అసలు శక్తి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. దేశవ్యాప్తంగా శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న ఈ సంస్థ తన అసంఖ్యాక కార్యకర్తలను అన్నా ఉద్యమాగ్నులు మరింతగా ప్రజ్వరిల్లేలా చేసేందుకు నియోగించింది. నర్మదాసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించిన మేధా పాట్కర్; సోషలిస్టు మేధావి యోగంద్ర యాదవ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మొదలైనవారు కూడా హజారే ఉద్యమానికి సంపూర్ణ మద్దతునిచ్చారు. అయితే ఆ ఉద్యమ అంతిమ విజేత మట్టుకు భారతీయ జనతా పార్టీ. 2014 సార్వత్రిక ఎన్నికల ఫలితాలే అందుకు తిరుగులేని నిదర్శనం. అన్నా ఉద్యమ ఉధృతిలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికీ ఒక పాత్ర ఉన్నది. ఉద్యమ జటిలతను మన్మోహన్ సర్కార్ తొలుత అర్థం చేసుకోలేదు. ఆ క్లిష్ట పరిస్థితి అర్థంకాగానే అన్నాతో 'సంప్రదింపులు' జరిపేందుకు కేబినెట్ మంత్రులు ప్రణబ్ ముఖర్జీ, ఏకే ఆంటోనీలతో పాటు మరో ఇద్దరు ప్రముఖుల సహాయాన్ని యూపీఏ ప్రభుత్వం తీసుకుంది. ఒకరు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విలాసరావు దేశ్‌ముఖ్, మరొకరు 'నాబార్డ్' మాజీ చీఫ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర సారంగి. హజారేతో చర్చలు సఫలమయేందుకు ఈ ఇరువురూ విశేషంగా తోడ్పడ్డారు. ప్చ్, ప్రయోజన మేముంది? అప్పటికే యూపీఏ సర్కార్ చేతుల్లోంచి కాలం జారిపోయింది. అరేబియా జానపద గాథలో వలే సీసా నుంచి భూతం బయటపడింది, మళ్లీ దాన్ని సీసాలో బంధించడం అసాధ్యమైపోయింది. పర్యావరణ పరిరక్షణ యోధుడు, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష అన్నాహజారే ఆందోళనకు పూర్తి భిన్నమైనది. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది-- వాంగ్‌చుక్ డిమాండ్ నిర్దిష్ట వాస్తవికత ఆధారంగా చేసింది. జాతీయస్థాయి ప్రవేశపరీక్షలో అవకతవకలతో కోట్లాది విద్యార్థినీ విద్యార్థులు లోనైన కష్టనష్టాలకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది కాక్రోచ్ జనతాపార్టీ డిమాండ్. దీనితో పోల్చితే అన్నా డిమాండ్ సైద్ధాంతికమైనది, సంకీర్ణమైనది. అన్నా, వాంగ్‌చుక్ డిమాండ్ల మధ్య వ్యత్యాసం ఆ ఇరువురి రాజకీయ చతురత మధ్య తారతమ్యతకు అద్దం పడుతుంది. హజారేకు ఉన్నత స్థాయిలో రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఆయనను ప్రభావితం చేయడమూ సులువైన విషయమే. అన్నాతో పోలిస్తే వాంగ్‌చుక్ దృఢ విశ్వాసాలు ఉన్న పోరాటకారుడు. ఆయన ఒకసారి ఒక నిర్ణయానికి వస్తే మరెవ్వరూ ఆయన్ని అందుకు విరుద్ధంగా వ్యవహరించేలా ప్రభావితం చేయలేరు. తన నిర్ణయం నెగ్గేంతవరకు పట్టుదలతో ఉండే యోధుడు ఆ హిమాలయ భారతీయుడు. అన్నా డిమాండ్‌ను నెరవేర్చితే ముంచుకొచ్చే ముప్పు ఏమీలేదు. ఎందుకంటే ఆ డిమాండ్ అంతిమంగా నిరుపయోగకరమైనది. వాంగ్‌చుక్ పోరాట లక్ష్యం కంటే అన్నా ఉద్యమ ఆశయాన్ని నెరవేర్చడం సులభం. రెండోది-- వాంగ్‌చుక్‌కు ప్రతిపక్షాల మద్దతు లేకపోవడం. అన్నా ఆందోళన సందర్భంలో ఆనాటి ప్రతిపక్షం బీజేపీ ఆ ఉద్యమాన్ని తన రాజకీయ ప్రయోజనాల పురోగతికి ఒక అపూర్వ అవకాశంగా పరిగణించింది. మన్మోహన్ సర్కార్ పాలనలోని అవినీతిని ఎండగట్టేందుకు ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నది. వాంగ్‌చుక్ పోరు సందర్భంలో ప్రస్తుత ప్రతిపక్షం ఏమి చేస్తున్నది? స్తబ్ధుగా ఉండిపోవడమే కాదూ? ఈ మందకొడితనానికి కారణమేమిటి? ప్రతిపక్షాలు వేటికవిగా ఉండిపోవడమే. ఈ అనైక్యత వల్లే మోదీ సర్కార్‌ను సవాల్ చేసేందుకు వాటికొక సమైక్య, సుసంగత వ్యూహం లేకుండాపోయింది. వాంగ్‌చుక్ ఉద్యమ మనోరథం నెరవేరితే తమకు సమకూరే ప్రత్యక్ష ప్రయోజనమేదీ లేదని విపక్షాలు భావిస్తున్నాయి. అన్నా ఉద్యమం ప్రత్యక్ష లబ్ధిదారు బీజేపీ. అందుకే అది ఆనాడు ఆ ఆందోళనను అన్ని విధాలా ఎగదోసింది, లబ్ధి పొందింది. అన్నా హజారే బీజేపీ చేతుల్లో కీలుబొమ్మ. వాంగ్‌చుక్ అలా కాదు, ఆయన ఒంటరి యోధుడు. హజారే ఆందోళనలో సమస్త భారతీయులూ అవినీతికి వ్యతిరేకంగా ముక్తకంఠంతో ఘోషించారు.. అవినీతి పాలకులను అధికారం నుంచి తొలగించేందుకు సమైక్యమయ్యారు. సినీ పరిశ్రమలోని హీరోలు, హీరోయిన్లతో పాటు అంతగా ప్రాధాన్యం లేని నటీనటులు కూడా అవినీతిని గర్హించారు, నాటి పాలకులపై ధ్వజమెత్తారు. మరి వాంగ్‌చుక్ ఉద్యమ సందర్భంలో ఆ గళాలు ఏవీ? ఆ లోకహితులు కానరాలేదేమీ? వ్యాపార దిగ్గజాలు, పారిశ్రామిక ప్రముఖులలో పలువురు ఆనాడు ఉదారంగా అన్నా ఉద్యమానికి బాసటగా నిలబడ్డారు. మోదీ ప్రభుత్వ నీడలో ఉన్న ఆ దిగ్గజాలు, ప్రముఖులు ఇప్పుడు ఆత్మపరిశీలనా యోగంలో నిమగ్నులై ఉన్నారు. కేవలం పదిహేను సంవత్సరాల వ్యవధిలో మన సజీవమైన, ఉద్వేగ భరితమైన, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం ఎంత నిశ్శబ్దంగా మారిపోయిందో కదా! మౌనం, అంతటా మౌనం. ఈ మౌనాన్ని ప్రశ్నించేందుకు మనం సిద్ధంగా ఉన్నామా? మన ప్రజాస్వామ్యం సమస్త పౌరుల శ్రేయస్సును కోరే, దానిని సాధించే గొంతుకను మళ్లీ పొందేందుకు తోడ్పడుతుందా? ఈ ప్రశ్నలను జరూరుగా పరిష్కరించుకోవాలి. లేనిపక్షంలో ప్రస్తుత మౌనం మూగవారి నిశ్శబ్దాన్నే ప్రతిధ్వనిస్తుంది.

# గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

-ప్రతి రైతు ఫామ్ పాండ్‌ల నిర్మాణానికి ముందుకు రావాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

హంసకలం వార్త



మారుమూల గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.మంగళవారం కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ గ్రామంలోని తాగునీటి వసతి,విద్యుత్, టెలికాం సేవలు,ఇతర మౌలిక సదుపాయాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామపంచాయతీ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపితే వెంటనే నూతన బోరుబావి మంజూరు చేస్తామని తెలిపారు. బోరుబావి ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని, ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్‌లు అత్యంత ఉపయోగకరమని పేర్కొన్న కలెక్టర్,ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని రైతు ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను పరిశీలించి, ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న రైతులతో పాటు కొత్తగా ముందుకు వస్తున్న రైతులను అభినందించారు. గ్రామంలో మరిన్ని ఫామ్ పాండ్‌లు ఏర్పాటయ్యేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.అలాగే గ్రామంలో టెలికాం సేవల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.భూగర్భ జలాల పరిరక్షణలో ప్రతి గ్రామస్థుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్,తహసీల్దార్ కమల్ సింగ్,ఎంపీడీఓ వనజ,సర్పంచ్ శివాజీ, ఇతర

# పోలీస్ సిబ్బందికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్

హంసకలం వార్త



నిజామాబాదు నగరం లో బ్రిడ్జి గ్యాప్ హాస్పిటల్ , ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ , మేఘన డెంటల్ హాస్పిటల్ , లెజిట్ డయాగ్నొస్టిక్స్ వారి సౌజన్యంతో పోలీస్ శాఖ సిబ్బందికి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరము క్యాంపును కమీషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ " పోలీస్ ఉద్యోగం అనేది ప్రజల ప్రాణాలు , ఆస్తుల రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండే అత్యంత బాధ్యతాయుతమైన సేవ అన్నారు. విధి నిర్వహణలో పోలీసులు అనేక రకాల శారీరక , మానసిక ఒత్తిళ్లను ఎదుర్కొంటారనీ, అసమయ భోజనం , నిద్రలేమి , నిరంతర విధులు , ఒత్తిడితో కూడిన జీవనశైలి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలీసు అధికారి , సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా విధి నిర్వహణలో భాగంగానే భావించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.క్యాన్సర్ అనేది ముందస్తుగా గుర్తిస్తే సమర్థవంతంగా చికిత్స చేయగలిగే వ్యాధి. అవగాహన లోపం , నిర్లక్ష్యం వల్ల చాలామంది ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తుంటారనీ, ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ద్వారా చికిత్స విజయవంతం కావడమే కాకుండా ప్రాణాలను కూడా కాపాడుకోవచ్చున్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం అన్నారు.పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ బ్రిడ్జ్ గ్యాప్ హాస్పిటల్ , ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ , మేఘనా డెంటల్ హాస్పిటల్ , లెజెండ్ డయాగ్నొస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్ ఎంతో ఉపయోగకరమైనదన్నారు. వైద్యులు అత్యాధునిక పద్ధతులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి , క్యాన్సర్ లక్షణాలు , నివారణ చర్యలు , జీవనశైలిలో పాటించాల్సిన జాగ్రత్తలపై విలువైన సూచనలు అందించడం అభినందనీయం అని పేర్కొన్నారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

-స్పెషల్ సీఎస్,రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్

-అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

హంసకలం వార్త

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యమని స్పెషల్ సీఎస్,రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్ స్పష్టం చేశారు.జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలపై స్పెషల్ సీఎస్,రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి,పోలీస్ శాఖ,జాతీయ రహదారి శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ హాజరయ్యారు.స్పెషల్ సీఎస్,రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు,ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు.నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు.అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు,పోలీసులు,జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్,రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ వాహనాలు ఎప్పుడూ పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు.ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు,ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు.అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి.వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



-ప్రభుత్వ ఆదేశాలు పక్కాగా అమలు


రోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు.జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ జాతీయ రహదారుల వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్స్ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.టాస్క్ ఫోర్స్ ఆద్వర్యంలో జిల్లాలో చేపట్టిన పనులపై ఆరా తీసి భవిష్యత్తు ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్,ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత,జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్,ఆర్అండ్ బీ డీఈలు శాంతయ్య,వరప్రసాద్, పోలీస్,నేషనల్ హై వే అధికారులు పాల్గొన్నారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డులో రామగుండం కరాటే విద్యార్థుల ప్రతిభ

-రికార్డు విజేతలను సత్కరించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా.

హంసకలం వార్త

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 26న నిర్వహించిన లార్జెస్ట్ కరాటే గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2,900 మంది విద్యార్థులు, సీనియర్ కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. వీరిలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన 1,212 మంది విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు.ఈ అరుదైన ఘనతలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగుండానికి చెందిన జపాన్ షిటో ర్యూ కరాటే స్కూల్‌కు చెందిన 25 మంది విద్యార్థినీ, విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు.గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేకంగా అభినందించి,సర్టిఫికెట్లు,మెడల్స్ అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,కరాటే అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, జీవితంలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించే గొప్ప మార్షల్ ఆర్ట్ అని అన్నారు.ముఖ్యంగా బాలికలు స్వీయరక్షణ కోసం కరాటేను తప్పనిసరిగా నేర్చుకోవాలనిసూచిం చారుక్రీడలతో పాటు విద్యలోనూ రాణిస్తూ దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని మరెన్నో గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జపాన్ షిటో ర్యూ కరాటే స్కూల్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ అండ్ బెల్ట్



ఎగ్జామినర్ కరాటే శ్రీనివాస్ పాల్గొనడం సంస్థకు గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు.ఆయన ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం పట్ల జపాన్ షిటో ర్యూ కరాటే స్కూల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్,సీనియర్ ఇన్‌స్ట్రక్టర్లు ఎస్. శ్రీనివాస్,శ్రావణ్ పటేల్,సంజన, అభిజ్ఞ,ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీరామ్, స్పందన క్లబ్ కార్యదర్శి డాక్టర్ కె. నరేంద్ర సోనీ, చిరంజీవి ఆదిత్య, స్వామి,గణేష్ రాజ్‌తో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో నీటి సమస్యపై చైర్‌పర్సన్ ఉమారాణి ఆకస్మిక తనిఖీ

హంసకలం వార్త



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న నీటి సమస్యపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుని, మిషన్ భగీరథ అధికారులతో వెంటనే మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా హాస్టల్‌లో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడిన చైర్‌పర్సన్, వారికి అందిస్తున్న ఆహారం నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని వార్డెన్‌తో పాటు సిబ్బందికి స్పష్టం చేశారు. విద్యార్థినులకు మెరుగైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ వనిత రామ్మోహన్, డీఈ హన్మంత్ రావు, హాస్టల్ వార్డెన్ స్వప్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను సన్మానించిన నూతన'ట్రెసా' కార్యవర్గం



హంసకలం వార్త

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్(ట్రెసా) ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు ఎల్. రాజేశ్వరి,ప్రధాన కార్యదర్శి బి.కార్తిక్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం,మొక్కలు అందించి ఘనంగా సన్మానించారు.ఈ సన్మాన కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు ఎన్. విలాస్,సిద్ది అజీమ్, కోశాధికారి ఎస్. అరుణ,ఉపాధ్యక్షులు రాథోడ్ దత్తుసింగ్,కె. సాయిరాం, ఎం. కవితారాణి,ఎండీ. అతరుద్దీన్,ఆర్గనైజింగ్ సెక్రటరీలు అభినవ్ యాదవ్,ఎం.సౌమ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## రిమ్స్ ఆసుపత్రిలో మరింత మెరుగైన వైద్యసేవలు

-జిల్లా కలెక్టర్ రాజర్షిషా



హంసకలం వార్త

రిమ్స్‌లో వైద్య సేవలు మరింత మెరుగుపడాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు.మంగళవారం రిమ్స్ ఆస్పత్రిలోని డైరెక్టర్ ఛాంబర్లో వివిధ విభాగాల అధిపతులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా వివిధ విభాగాలకు అవసరమైన అత్యవసర వైద్య పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు.ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశ నిర్ణయాలకు అనుగుణంగా,ప్రస్తుతం ఆసుపత్రిలోని వివిధ విభాగాలకు అత్యవసరంగా కావలసిన వైద్య పరికరాల తుది జాబితాను సిద్ధం చేయడం జరిగిందని వివరించారు.ప్రధానంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ,యూరాలజీ, ఈఎన్‌టీ,అనస్థీషియా, ఆర్థోపెడిక్స్,డెంటల్, ఆప్తాల్మాలజీ,సైకియాట్రీ,క్యాజువాల్టీ,డయాలిసిస్ విభాగాలకు అవసరమైన పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దీపక్ పుష్కర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

హంసకలం వార్త



జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, కలెక్టర్ మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని అన్నారు.వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ లు రవి బాబు,సుందర్ సింగ్,యాదయ్య, ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త
HAMSA KALAM VARTA
బుధవారం 22 జూలై 2026

## కాకా అభిమానులను ఎవరైనా కొట్టాలంటే

-మొదటి దెబ్బ నాపైనే పడుతుంది
-పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ
-దశాబ్దాలుగా కాకా అండగా ఉన్నారో తాను అట్టనే ఉంటానని భరోసా
-కార్యకర్తలకు కష్టమొచ్చినా, నష్టమొచ్చినా అండగా ఉంటానని హామీ
-ఇబ్బందులు ఉంటే తనను నేరుగా సంప్రదించాలన్న వంశీకృష్ణ
-కార్యకర్తలపై దాడులు, కేసులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చిరిక
-చిల్లర రాజకీయాలు చేసిన వారినీ, చేయంచే వారినీ వదిలిపెట్టబోమని స్పష్టం



హంసకలం వార్త

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ముఖ్యంగా "కాకా" అభిమానులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కాకా కార్యకర్తలకు ఎలా అండగా నిలిచారో,అదే విధంగా తాను కూడా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.కాకా అభిమానులను ఎవవైనా కొట్టాలంటే..మొదటి దెబ్బ నాపైనే పడుతుంది.కార్యకర్తల గౌరవం,భద్రత నా బాధ్యత.ఎవరికైనా ఎలాంటి ఇబ్బంది వచినా నేరుగా నాకు తెలియజేయండి.మీ కోసం నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని అన్నారు.మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలపై దాడులు చేయడం,అక్రమ కేసులు నమోదు చేయడం వంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించదని ఆయన హెచ్చిరించారు.రాజకీయ కక్షసాధింపు కోసం కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునే వారిపై చట్టపరంగా, రాజకీయంగా గట్టిగా పోరాడతామని స్పష్టం చేశారు.చిల్లర రాజకీయాలకు పాల్పడుతూ పార్టీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయాలని చూసే వారిని ప్రజలు గమనిస్తున్నారని పేరకొన్నారు.అలాంటి చర్యలకు పాల్పడే వారిని మాత్రమే కాకుండా,వారిని ప్రోత్సహించే వారినీ వదిలిపెట్టబోమని హెచ్చిరి ంచారు.కాంగ్రెస్ పార్టీ బలం కార్యకర్తలేనని,వారి కష్టం వల్లే పార్టీ ఈ స్థాయికి చేరుకుందని పేరకొన్న వంశీకృష్ణ,ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగే వరకు తాను పోరాడుతానని తెలిపారు.ప్రజాసేవే తన ధ్యేయమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా నిరంతరం పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.కార్యకర్తలు ఐక్యంగా ఉండి,పార్టీ బలోపేతానికి కృషి చేస్తే భవిష్యతులో పెద్దపల్లి పార్టమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు.కార్యకర్తలు నా కుటుంబ సభ్యులు లాంటివారు.వారి కన్నీళ్లు నా గుండెను తాకుతాయి. వారి కష్టం నా కోసం పవిత్రమైనది. నేను ఎప్పుడూ వారి వెనుకనే ఉంటా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ,

## జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

-సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తూచా తప్పక పాటించాలి.
-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా.



హంసకలం వార్త

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించేందుకు రవాణా, పోలీస్, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.పోలీసు, రవాణా, ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులు సమన్వయంతో రహదారుల భద్రత, ప్రమాదాల నివారణకు తగిన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. "జిల్లా రహదారి భద్రతా టాస్క్ ఫోర్స్" ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం "రైట్ ఆఫ్ వే" మార్గం వెంబడి కొత్తగా ఎలాంటి వాణిజ్య నిర్మాణాలు అనుమతించరాదని, మునిసిపల్, ట్రేడ్ లైసెన్స్ వంటివి "రైట్ ఆఫ్ వే" వెలుపల ఏర్పాటు చేయకుండా చూడాలని, ఎలాంటి కొత్త అనుమతులూ ఇవ్వరాదని పేర్కొన్నారు.జాతీయ రహదారుల వెంట ఆక్రమణలు పరిశీలించేందుకు, రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రోన్ ద్వారా నిఘా ఉంచాలని తెలిపారు. రోడ్డు భద్రత చర్యలకు అవసరమైన నిధులు కేటాయిస్తామని అన్నారు. జాతీయ రహదారుల వెంట గట్టి నిఘా, పెట్రోలింగ్, అక్రమ పార్కింగ్ వంటి అంశాలను పర్యవేక్షించాలని పోలీస్, రవాణా, నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పెట్రోలింగ్ కోసం పోలీస్ రవాణా శాఖ సిబ్బందితో కూడిన ప్రత్యేక హైవే నిఘా బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్ డిటెక్టర్లు, కెమెరాలు, సైన్ బోర్డులు, ఎమర్జెన్సీ కాల్ బాక్సులు వంటివి పరిశీలించాలని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్ గుర్తించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్లాక్ స్పాట్ వద్ద హైమాస్ట్ లైటింగ్, స్పీడ్ ఎన్ ఫోర్స్ మెంట్ కెమెరాలు, మెట్రో రిఫ్లెక్టివ్ హెచ్చరిక సంకేతాలు వంటివి ఏర్పాటు చేయాలన్నారు.భారీ వాహన డ్రైవర్లకు విశ్రాంతి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్య సహాయం కోసం సమీప ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని తెలిపారు. ఈ సౌకర్యాలను పరిశీలించాలని, లేని చోట్ల అవసరమైన చర్యలు తీసుకుని నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని పేర్కొన్నారు.

# పదేళ్ల బీఆర్ ఎస్ అరాచక పాలనను ప్రజలు మరిచిపోలేదు

-టీపీసీసీ చీఫ్?

హంసకలం వార్త

పదేళ్ల బీఆర్ఎస్ అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్? కుమార్? గౌడ్?అన్నారు. వారిది అరాచక పాలన అయితే కాంగ్రెస్?ది ప్రజాపాలన అని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో కేటీఆర్ దొంగ ఏడుపు ఏడుస్తున్నారన్నారు.బీఆర్ఎస్ పాలనలో కేవలం కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఎందరో నిరుద్యోగుల ఉసురు పోసుకున్న కేటీఆర్?కు మాట్లాడే అర్హత లేదని పీసీసీ చీఫ్ అన్నారు. ఉద్యోగాల పేరుతో కేటీఆర్ దొంగ ఏడుపు ఏడుస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. అప్పట్లో ఇరిగేషన్ శాఖలో తప్పులకు కేంద్ర బిందువు అయిన హరీష్ రావు ఈరోజు కరువు కరువు అంటూ ఏకరువు పెట్టడం దుర్మార్గమన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అంతా తానే నడిపిన కేసీఆర్ కాళేశ్వరాన్ని నిర్మించి వేల కోట్లు దోచుకున్నారన్నారు. కాళేశ్వరం నీళ్ల పేరుతో దోపిడీ జరిగిందన్నారు. ఒకచోట కట్టాల్సిన ప్రాజెక్టును మరోచోట కట్టి కమీషన్ల దందా చేసిన కేసీఆర్ కుటుంబం వల్లే ప్రాజెక్టు కుంగిపోవ డానికి కారణం కాదా అన్నారు.రెండున్నర ఇళ్లలో 70 వేల ఉద్యోగాలుకాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నరే ఒళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చిందని.. వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలు మా దగ్గర




ఉన్నాయని బొమ్మ మహేష్ కుమార్ అన్నారు. అసత్యాలు ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మేస్థితిలో లేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మెజార్టీ హామీలను పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఈరోజు పేద ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని,ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ఇలా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వెళ్తున్నామన్నారు. రూ.20వేల కోట్లకు పైగా రుణమాఫీ చేశామని వివరించారు. విద్యావైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఆయన తెలిపారు. నియోజకవర్గానికి మూడు వేలకు పైగా ఇళ్లు ఇచ్చామని.. ఇందిరమ్మ ఇళ్లతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.ఆర్వోబీ పనులు త్వరలోనే పూర్తవుతాయి మాధవనగర్ వద్ద ఆర్వోబీ పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్నాయని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రం తరపున అందాల్సిన నిధులు త్వరలోనే అందుతాయని తద్వారా ఆర్వోబీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. బాల్కొండలో అభివృద్ధి జరగట్లేదని ఎమ్మెల్యే ప్రశాం త్?రెడ్డి పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్ర మంలో ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్? ఎమ్మెల్యే భూపతిరెడ్డి, వ్యవసాయ కమిషన్? సభ్యుడు గడుగు గంగాధర్?, డీసీసీ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, డీసీసీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయ కురాలు కవితా రెడ్డి, కౌడపు శరత్ కాంగ్రెస్ నా యకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవల నాణ్యత పెంపే లక్ష్యం

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
-ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ప్రాథమిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
-ఆసుపత్రుల పనితీరు మెరుగుపడి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాలి
-కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

హంసకలం వార్త

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా, నాణ్యంగా అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ గుండారం ఎం.పీ.పీ.ఎస్. పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎస్‌ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ, పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములు, రామగిరి నూతన తహసీల్దార్ కార్యాలయం, మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, గుండారం ఎం.పీ.పీ.ఎస్. పాఠశాల లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని, ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ప్రతి



విద్యార్థికి చదవడం, రాయడం, వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో అలవడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ బోధన, విద్యార్థుల హాజరు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.కమాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం, మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఆగస్టు 1వ తేదీ నుంచి కొత్త భవనం నుంచే తహసీల్దార్ కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మండలంలో జరుగుతున్న ఎస్‌ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి దశను కచ్చితత్వంతో అమలు చేయాలని ఆదేశించారు.కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ లేబర్ రూమ్, వ్యాక్సినేషన్ విభాగాన్ని పరిశీలించారు. ఆసుపత్రి పనితీరును మెరుగుపరచడంతో పాటు ఓపీ సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ఆరోగ్య సూచికలను నిర్దేశిత ప్రమాణాల మేరకు అమలు చేయాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కమాన్ పూర్ తహసీల్దార్ వాసంతి,రామగిరి తహసీల్దార్ సుమన్ ,ఎంపీడీఓ శైలజారాణి,ఈ ఈ పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ లు వరలక్ష్మి, జగదీశ్,రామగిరి , తదితర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు

-జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)పి.చంద్రయ్య

హంసకలం వార్త

జిల్లా వ్యాప్తంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్య, పౌష్టికాహారం,పరిశుభ్రమైన వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీ, లక్షెట్టిపేట,దండేపల్లి మండలం కర్ణపేట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలల పరిసరాల పరిశుభ్రత,తరగతి గదులు,వసతి, భోజనశాల,వంటశాల, త్రాగునీటి వసతులు, విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యత, విద్యాబోధన, హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు.విద్యార్థులతో మాట్లాడి బోధన, వసతులు, భోజన నాణ్యత, వసతిగృహ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెంపుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు,స్కూల్ కాంప్లెక్స్ తదితర పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరగా వినియోగంలోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు,వసతి గృహాలు, గ్రామాలలో పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా చూసి,క్లోరినేషన్ చేసిన సురక్షిత నీటిని ప్రజలకు,విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. హాజీపూర్ మండల కర్ణమామిడి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలో మురుగు కాలువల నిర్వహణ,పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని, వర్షాకాలంలో కూలిపోయే ప్రమాదంలో, శిథిలావస్తలో ఉన్న ఇళ్లను గుర్తించి, అవసరమైతే ఆయా కుటుంబాలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు చర్యలు



తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.లక్షెట్టిపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సందర్శనలో పాఠశాల పరిసర ప్రాంతాలలో వీధిదీపాలు పనిచేయడం లేదని గుర్తించి, సంబంధిత విద్యుత్ శాఖ అధికారిని పిలిపించి వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు.అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ కమిషనర్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో మండల పంచాయతీ అధికారి సుమన్, మండల విద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ప్రత్యేక అధికారులు, సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు,పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన రైతు కుటుంబాలకు చెక్కులు అందజేత

**-బీ ఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు**

హంసకలం వార్త

కాంగ్రెస్ కు ఓటేసినా పాపానికి ప్రజలు నరకం చూస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆవేదన వ్యక్తం చేశారు.మంగళవారం మండలం లోని అంకతిపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదన్నార ం.రాష్ట్రానికి ఎల్నినో ప్రభావం చేసిన నష్టం కంటే కాంగ్రెస్ చేసిన నష్టమే ఎక్కువన్నారు.కన్నెపల్లి లో ఉన్న వాటర్ ను రోజుకు మూడు టీఎంసీ ల చొప్పున అన్నారం,సుందిల్లా, ఎల్లంపల్లి బ్యారేజ్ లకు బ్యాక్ వాటర్ ఎందుకు పంపడలేదు అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు?ఒక్క ఎల్నినో కాదు ఇంకొక ఎల్నినో వచ్చిన మన రాష్ట్రానికి కరువు రాకుండా బ్యారేజ్ లు కట్టి బాహుబలి మోటార్లు పెట్టించిన ఘనత మన కేసీఆర్ దేనని అన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కెసిఆర్ కంటే ఎక్కువ ఇస్తా అని ప్రజలను మభ్యపెట్టి నాలుగు సార్లు ఎగొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి అని ఏద్దేవా చేశారు. అంతేకాకుండా నిరుద్యోగ భృతి,రెండు లక్షల ఉద్యోగాలు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇలా ఇచ్చిన హామీలన్నిటిని తుంగలో తొక్కాడన్నారు.కాళేశ్వరంపై రేవంత్ రెండు పిల్లర్స్ దెబ్బతిన్నాయని చెప్పి,32 నెలలుగా ఎందుకు రిపేర్ చేయించలేదని ప్రశ్నించారు?. కాళేశ్వరం ప్రాజెక్టు మీద బూటకపు ప్రచారాలు చేస్తూ రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి వరంగల్ సభలో ఏక కాలంలో రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు.32 నెలలు గడచిన ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు?. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తన పద్దతిని మార్చుకోవాలని హెచ్చరించారు.నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలే కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. అదేవిధంగా అకాల వర్షానికి గోడలు కూలి రైతులు మరణిస్తే రెండున్నర నెలలు గడచినా వారికీ ఎలాంటి సహాయం అందలేదని బాధను వ్యక్తం చేశారు.చివరికి కే సీ ఆర్ ప్రవేశపెట్టిన రైతుభీమా ద్వారా ఒక్క రైతు కుటుంబానికి మాత్రమే రూ.5 లక్షలు అందాయన్నారు. మరణించిన నలుగురు రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చెక్కులను కే టీ ఆర్ అందజేశారు.రైతులు చనిపోతున్న రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదా అని ప్రశ్నించారు?.ఇంకొక్క 28 నెలల్లో కెసిఆర్ ప్రభుత్వం వస్తుందని ఈ చేతకాని,రైతులను పట్టించుకోని ప్రభుత్వం పడిపోతుందని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.ఈ కార్యక్రమంలోజిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు,చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి,కొప్పుల ఈశ్వర్,జీవన్ రెడ్డి, జోగు రామన్న,ఎమ్మెల్యేలు కోవ లక్ష్మీ, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, సుంకే రవి,కోనేరు కోనప్ప,దుర్గం చిన్నయ్య,మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు,రాష్ట్ర నాయకులు విజిత్ రావు,మాజీ డీ సీ ఎమ్ ఎస్ తిప్పని లింగయ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ కాంతయ్య,వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్,సర్పంచ్ లు ఎల్తాపు సుధాకర్, మాజీ సర్పంచ్ మోటపలుకుల తిరుపతి,సొల్లు సురేష్, నాయకులు చాంద్ పాషా,అంకతి శ్రీనివాస్, తోట సాగర్,మాజీ యూత్ అధ్యక్షుడు మారిశెట్టి సుమన్,స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పోలీసింగ్‌లో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలం

**-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.**

హంసకలం వార్త

పోలీసింగ్‌లో ప్రజల భాగస్వామ్యమే విజయానికి మూలమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ అలం అన్నారు.మంగళవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఇల్లందకుంట మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల అవగాహన, రోడ్డు భద్రత, పోలీసింగ్ బలోపేతానికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.మొదట ఇల్లందకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా నిఘా వ్యవస్థను ప్రారంభించిన సీపీ, గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు మరింత విస్తరించాలని పిలుపునిచ్చారు.అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. నేటి మొక్కలే రేపటి తరాలకు జీవనాధారమని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా అత్యవసర పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లు ముద్రించిన ఎగ్జామ్ ప్యాడ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యతో పాటు భద్రతపై కూడా అవగాహన కలిగి ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా స్థానిక ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేసిన సీపీ, హెల్మెట్ ధరించడం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని పేర్కొన్నారు.అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, పోలీస్--ప్రజల సమన్వయంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. గ్రామాల్లో మాదకద్రవ్యాలు, జూదం, సైబర్ మోసాలు, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఇతర అక్రమ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పర్యటనలో భాగంగా ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించిన సీపీ, కిట్ ఇన్‌స్పెక్షన్, పెండింగ్ ఫైళ్లు, కోర్ పోలీసింగ్, చట్ట అమలు, క్రైమ్ వెహికల్స్, క్రైమ్ ప్రాపర్టీ, రికార్డులు, ప్రభుత్వ ఆస్తులు, కేసుల దర్యాప్తు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచడంతో పాటు నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రతిపాదిత ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయిం చిన స్థలాన్ని పరిశీలించి, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందేలా త్వరితగతిన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబం ధిత అధికారులకు సూచించారు.అనంతరం జమ్మికుంట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, పెండింగ్ ఫైళ్లు, రికార్డులు, ప్రభుత్వ ఆస్తులు, కార్యాలయ నిర్వహణ, పోలీసింగ్ పనితీరును సమీక్షించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, హుజూరాబాద్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జమ్మికుంట రూరల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, ఇల్లందుకుంట ఎస్సై ఎం.క్రాంతికుమార్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు మరియు స్థానికులు పాల్గొన్నారు.




# నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

**-అధికారులతో సమీక్షలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

హంసకలం వార్త

నిజామాబాద్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆయన నగర అభివృద్ధిపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు, అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ పనులు తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నగరంలోని అన్ని ప్రధాన మార్గాలలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని అన్నారు. అవసరమైన చోట వన్ వే అమలు చేయాలని, యూటర్న్ ల వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రోడ్డు భద్రత నిబంధనలు పక్కగా పాటించేలా వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ రూల్స్ ను పక్కాగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కాగా, ఆయా ప్రాంతాలలో రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయించాలని చెడిపోయిన రహదారులకు మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో గుంతల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున ఈ పనులకు తక్షణమే చేపట్టాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పురాతన వాటర్ ట్యాంకులను కూల్చి వేయించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పూలాంగ్ చౌరస్తా, ఓల్డ్ ఎల్ఐసి చౌరస్తా తదితర ముఖ్య కూడళ్ళ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు అవకాశం లేకుండా సర్కిళ్లను వెడల్పు చేయాలని అన్నారు. ప్రజల సౌకర్యార్థం చేపట్టిన సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ భవన సముదాయాల పనులను, కళాభారతి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయించి యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎల్లమ్మ గుట్టలో మంచినీటి ట్యాంకును నిర్మించాలని సూచించారు. రింగ్ రోడ్డు ప్రతిపాదనలు రూపొందించాలని ఇంటింటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురి కాకుండా వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు అదనపు కలెక్టర్ భుజంగరావు, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# జాతీయ రహదారుల భద్రతపై సమీక్ష



హంసకలం వార్త

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణ, భద్రతా ప్రమాణాల అమలు, దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల అమలుపై మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ విక్టర్ అధ్యక్షత వహించగా, జాతీయ రహదారుల సంస్థ, రహదారులు--భవనాల శాఖ, జిల్లా రవాణా శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, రహదారి గుర్తుల ఏర్పాటు, రక్షణ కంచెలు, వీధి దీపాల ఏర్పాటు, రహదారి భద్రతకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, అత్యవసర వైద్య సేవల బలోపేతం, రహదారి నిర్మాణ లోపాల సవరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, జాతీయ రహదారులపై భద్రతా ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసి దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సకాలంలో అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన చర్యలను వివరించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి జిల్లా స్థాయి అమలు నివేదికను సిద్ధం చేయాలని నిర్ణయించారు.

# విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలి

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




హంసకలం వార్త

విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, తరగతి గదుల్లో వారిని క్రియాశీలకంగా ఉంచేందుకు అధ్యాపకులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో తెలుగు లెక్చరర్లకు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...విద్యార్థులకు సబ్జెక్టులపై స్పష్టత వచ్చేలా బోధనా పద్ధతులలో మార్పులు తీసుకురావాలని సూచించారు.ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు, అధ్యాపకులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కళాశాలల్లో నూతన పాఠ్యపుస్తకాల లభ్యతను పరిశీలించి, ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, డి.ఐ.ఈ.ఓ ల దృష్టికి తీసుకువెళ్లి నివారించాలన్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వినియోగాన్ని పెంచాలని,ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా లభించే విద్యా విషయాలను తరగతి గదుల్లో ప్రాక్టీస్ చేయించాలని సూచించారు.విద్యార్థుల ప్రగతిని అంచనా వేసేందుకు ప్రతిరోజూ హోంవర్క్ ఇవ్వాలన్నారు. వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు తొలుత సులువైన ప్రశ్నలు, ఆపై మధ్యస్థ,కఠినమైన ప్రశ్నలతో సాధన చేయించాలన్నారు.అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా ఇంటర్మీడియట్ విద్య శాఖ,ఆధ్వర్యంలో నిర్వహించిన (ఓరియంటేషన్ ప్రోగ్రామ్) లో సర్టిఫికెట్ ఆఫ్ పార్టిసిపేషన్ పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్, ఇతర అధికారులు, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర మంత్రి హోదా

**-హర్షం వ్యక్తం చేస్తున్నారు జిల్లా ప్రజలు**

హంసకలం వార్త



తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విప్‌లు అయిన యెన్నం శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట విజయ రమణ రావు,వేముల వీరేశంకి రాష్ట్ర మంత్రి హోదాను కల్పిస్తూ G.O.Rt.No.1064 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విప్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న యెన్నం శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర మంత్రి హోదా కల్పించడం పట్ల మహబూబ్‌నగర్ నియోజకవర్గ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ నాయకు లు,కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, స్టేట్ వారెంట్ ఆఫ్ ప్రిసిడెన్స్‌లోని ఆర్టికల్--18 ప్రకారం రాష్ట్ర మంత్రి హోదాకు సంబంధించిన అన్ని అధికారిక ప్రోటోకాల్‌లు, మర్యాదలు యెన్నం శ్రీనివాస్ రెడ్డికి వర్తిస్తాయి.ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, శాసనసభలో ప్రభుత్వ తరపున సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న యెన్నం శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర మంత్రి హోదా కల్పించడం ఆయన సేవలకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నారు.

# బిజినెస్

## కొత్త రంగుల్లో ఐఫోన్ 18 ప్రో- పెదవి విరుస్తున్న అభిమానులు!



ప్రముఖ దిగ్గజ టెక్ సంస్థ యాపిల్ త్వరలోనే విడుదల చేయనున్న ఐఫోన్ 18 ప్రో సిరీస్‌పై రకరకాల వార్తలు టెక్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నాయి. సెప్టెంబరులో అధికారికంగా లాంచ్ కానున్న ఈ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ డిజైన్, ఫీచర్లకు సంబంధించి లీకైన కొన్ని వివరాలు వినియోగ దారులను కొంతవరకు అసంతృప్తికి గురిచేస్తున్నాయి. ప్రత్యేకించి ఫోన్ మందం, బరువు, అందుబాటులో ఉండే రంగుల విషయంలో పలు ఊహాగానాలు బయటకు వచ్చాయి. లీకైన వివరాల ప్రకారం.. నయా ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లు ప్రస్తుత ఐఫోన్ 17 ప్రో కంటే దాదాపు 2 మిమీ వరకు ఎక్కువ మందంతో ఉండే అవకాశముంది. ప్రముఖ టిప్‌స్టర్ల కథనం ప్రకారం ఈ ఫోన్‌ల మందం 10.75 మిమీ వరకు పెరగవచ్చు. అయితే, కొన్ని నివేదికలు కేవలం బ్యాక్ కెమెరా బంప్ పరిమాణం పెరగడం వల్లే ఈ వ్యత్యాసం కనిపిస్తుందని, ఫోన్ ప్రధాన బాడీ మందం 8.75 మిమీ మాత్రమే ఉంటుందని పేర్కొంటున్నాయి. మరో ప్రధాన మార్పు ఫోన్ బరువులో కనిపిస్తోంది. కొత్త ప్రో మ్యాక్స్ మోడల్ బరువు 240 గ్రాములకు చేరవచ్చని అంచనా. ఇది ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ (233 గ్రాములు) కంటే ఏడు గ్రామాలు ఎక్కువ. ఇప్పటికే చేతిలో పట్టుకోవడానికి బరువుగా ఉన్నాయనే విమర్శలు ఉండగా, కొత్త వెర్షన్ మరికొంత బరువు పెరగడం పట్ల వినియోగదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా, యాపిల్ ఐఫోన్ ప్రో సిరీస్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన 'బ్లాక్'కలర్ వేరియంట్‌ను ఈసారి నిలిపివే స్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దానికి బదులుగా డార్క్ చెర్రీ, లైట్ బ్లూ, సిల్వర్ రంగులలో మాత్రమే ఈ ఫోన్ లభించనుందని నివేదికలు చెబుతున్నాయి. ఒకవేళ ఇవే వార్తలు నిజమైతే, సన్నగా, తేలికగా ఉండే నలుపు రంగు ఐఫోన్ కోరుకునే వినియో గదారులకు ఇది కొంత ప్రతికూల వార్తగానే భావించవచ్చు. అయితే, యాపిల్ సంస్థ అధికారికంగా వెల్లడించే వరకు ఈ లీక్స్‌ను కేవలం అంచనాలుగానే చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

## వచ్చే నెల నుంచి పెరగనున్న మారుతి కార్ల ధరలు



దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా తమ వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. 2026 ఆగస్టు నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని, ప్యాసింజర్ వాహనాల ధరలు గరిష్ఠంగా రూ. 30,000 వరకు పెరగనున్నాయని మంగళవారం వెల్లడించింది. ముడిసరుకుల వ్యయం స్థిరంగా పెరుగుతుండటం, అధిక ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ తెలిపింది. ఈ మేరకు బీఎస్ఈ (బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్)కి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో మారుతి సుజుకి ఈ వివరాలను పొందుపరిచింది. పెరిగిన ఖర్చుల భారాన్ని తగ్గించుకోవడానికి అంతర్గతంగా అనేక చర్యలు చేపట్టినా, తప్పనిసరి పరిస్థితుల్లో కొంత భారాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్లు వివరించింది. "గత కొన్ని నెలలుగా వ్యయ నియంత్రణ చర్యల ద్వారా ఖర్చుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నించాం. అయినప్పటికీ, ద్రవ్యోల్బణ భారం అధిక స్థాయిలో ఉండటం, ప్రతికూల వ్యయ వాతావరణం కొనసాగుతుండటంతో, పెరిగిన వ్యయంలో కొంత భాగాన్ని మార్కెట్‌కు బదిలీ చేయక తప్పడం లేదు. అదే సమయంలో, వినియోగదారులపై దీని ప్రభావం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూస్తాం" అని మారుతి సుజుకి తమ ఫైలింగ్‌లో పేర్కొంది.

## ఇక ఇంటర్నెట్ లేకున్నా యూపీఐ చెల్లింపులు

### సిగ్నల్ లేని చోట కూడా సులభంగా పేమెంట్స్!



దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మరో విప్లవాత్మక మార్పు రాబోతోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లోనూ సులభంగా యూపీఐ లావాదేవీలు జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఒక కొత్త ఫీచర్‌ను అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా యూజర్ ఫోన్, వ్యాపారి వద్ద ఉండే 'పాయింట్ ఆఫ్ సేల్' (పీఓఎస్) టెర్మినల్ రెండూ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ, రూ.2,000 వరకు చెల్లింపులు చేయవచ్చు. ఈ సదుపాయాన్ని నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్ఎఫ్‌సీ) టెక్నాలజీ ఆధారంగా 'ట్యాప్-టు-పే' విధానంలో తీసుకురానున్నారు. ఈ కొత్త ఫీచర్ పనితీరుపై అందుతున్న సమాచారం ప్రకారం వినియోగదారులు ముందుగా తమ ఫోన్‌లో ఇంటర్నెట్ ఉన్నప్పుడు 'ఆన్-డివైస్ యూపీఐ లైట్ వ్యాలెట్'లోకి డబ్బును లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత, ఇంటర్నెట్ సిగ్నల్ లేని ప్రదేశాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, తమ ఎన్ఎఫ్‌సీ ఆధారిత స్మార్ట్‌ఫోన్‌ను వ్యాపారి వద్ద ఉన్న సర్టిఫైడ్ ఆఫ్‌లైన్ పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేస్తే చాలు. ఎలాంటి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే లావాదేవీ పూర్తవుతుంది. ఈ లావాదేవీ వివరాలను పీఓఎస్ టెర్మినల్ తనలో స్టోర్ చేసుకొని, తిరిగి ఇంటర్నెట్ కనెక్టివిటీ వచ్చిన వెంటనే సెటిల్‌మెంట్ కోసం పంపుతుంది.

**-విమానాలు, మెట్రోల్లో నో టెన్షన్..**

ముఖ్యంగా విమానాలు, భూగర్భ మెట్రో స్టేషన్లు, మారుమూల గ్రామాలు వంటి నెట్‌వర్క్ సరిగా లేని లేదా అసలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ ఫీచర్‌ను రూపొందిస్తున్నారు. దీనివల్ల ప్రయాణ సమయాల్లో, సిగ్నల్ సమస్యలు ఎదురయ్యే చోట్ల డిజిటల్ చెల్లింపుల విశ్వసనీయత, సౌలభ్యం గణనీయంగా పెరుగుతుంది. ఈ ఏడాది చివరి నాటికి ప్రముఖ తయారీదారుల నుంచి పీఓఎస్ టెర్మినల్స్‌కు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే ప్రక్రియను ఎన్‌పీసీఐ ప్రారంభించవచ్చని తెలుస్తోంది.

---

# క్రీడలు

## రోహిత్ శర్మ ఎప్పుడు విఫలమవుతాడా అని చూస్తున్నారు: మహ్మద్ కైఫ్



ఇంటర్నెట్ డెస్క్:

రోహిత్ శర్మ రిటైర్‌మెంట్ వార్తలపై ఇంకా చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈ విషయంపై టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ రిటైర్‌మెంట్ నిర్ణయం అతడి చేతుల్లోనే ఉండాలని.. ఆ హక్కు అతడికి మాత్రమే ఉందని స్పష్టం చేశాడు. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌కు ముందు రోహిత్ అంతర్జాతీయ భవిష్యత్తుపై అనేక ఊహాగానాలు వచ్చాయి. 2027 వన్డే ప్రపంచకప్‌లో అతడు ఆడకపోవచ్చనే వార్తలు కూడా వినిపించాయి. అయితే లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డేలో రోహిత్ తన పాత ఫామ్‌ను చూపిస్తూ 138 పరుగులతో మెరిశాడు. లార్డ్స్‌లో వన్డే సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. రోహిత్ శర్మ రిటైర్‌మెంట ఎప్పుడు తీసుకోవాలో రోహిత్ శర్మనే నిర్ణయించాలి. అతడికి ఆ హక్కు ఉంది. భారత క్రికెట్ కోసం అతడు ఎంతో కష్టపడ్డాడు. 12 వేల పరుగులు, 34 సెంచరీలు సాధించాడు. కెప్టెన్‌గా ఉన్నంతకాలం భారత్ ఓడిపోకుండా ఎంతో గొప్పగా నడిపించాడు. కూడా వైట్ బాల్ క్రికెట్‌లో రోహిత్ నాయకత్వంలో భారత్‌ను ఎవరూ ఓడించలేకపోయారు. కానీ ఇప్పుడు అతడిపై ఎంతో ఒత్తిడి ఉంది. 'రోహిత్ ఇక నీ పని అయిపోయింది.. రిటైర్‌మెంట్ తీసుకో' అంటూ చాలామంది మాట్లాడుతున్నారు. అలాంటి ఒత్తిడ ిలోనూ లార్డ్స్‌లో భారత బ్యాటర్లలో ఎవరికీ సాధ్యం కాని సెంచరీ అతడి బ్యాట్ నుంచి వచ్చింది' అని కైఫ్ పేర్కొన్నాడు.

**-రోహిత్ శర్మకు మద్దతు ఇవ్వాలి..**

'ఒకవేళ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 'రోహిత్ భాయ్, 2027 ప్రపంచకప్‌లో నాకు మీరు కావాలి' అని బహిరంగంగా చెబితే ఎలా ఉంటుంది? బీసీసీఐ కూడా 'రోహిత్‌పై ఎవరూ వేలెత్తి చూపొద్దు. అతడు ఎంత కాలం ఆడాలనుకుంటే అంతకాలం ఆడనివ్వండి. మేము అతడికి అండగా ఉన్నాం' అని ప్రకటిస్తే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. ప్రస్తుతం రోహిత్ ఒత్తిడిలో ఉన్నాడు. ఎందుకంటే అతడి వెనుక ఎవరూ నిలబడటం లేదనే భావన ఉంది. అందరూ అతడు ఎప్పుడు విఫలమవుతాడా అని చూస్తున్నారు. కానీ జట్టు, కెప్టెన్, కోచ్ తనకు అండగా ఉన్నారని అతడికి నమ్మకం కలిగితే.. దేశం కోసం హిమాలయాలనైనా అధిరోహించేంత శక్తితో ఆడతాడు. అభిమానులకు ఓ విజ్ఞప్తి.. ఇక నుంచి అందరూ ప్రశాంతంగా ఉండండి. రోహిత్ శర్మను స్వేచ్ఛగా భారత జట్టు కోసం ఆడనివ్వండి' అని కైఫ్ వెల్లడించాడు.

## రోహిత్ శర్మ ఇప్పుడు కొత్తగా నిరూపించుకోవాల్సిన అవసరం లేదు: రవి శాస్త్రి




ఇంటర్నెట్ డెస్క్:

భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ రిటైర్‌మెంట్ పుకార్లపై క్రికెట్ దిగ్గజం రవిశాస్త్రి స్పందించాడు. లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో 138 పరుగులతో చెలరేగిన సంగతి తెలిసిందే. వన్డే ఫార్మాట్‌లో రోహిత్ భవిష్యత్తుపై వస్తోన్న అనుమానాలకు ఈ ఇన్నింగ్స్ గట్టి సమాధానమని రవి శాస్త్రి పేర్కొన్నాడు. గత కొంతకాలంగా వన్డే ఫార్మాట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలుకనున్నాడంటూ నెట్టింట వార్తలు జోరుగా ప్రచారం జరుగుతున్నాయి. 2027 ప్రపంచ కప్ ప్రణాళికల్లోనూ అతడికి స్థానం లేదని టీమ్ మేనేజ్‌మెంట్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రోహిత్ సెంచరీ చేసి అందరికీ బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడంటూ రవి శాస్త్రి వెల్లడించాడు. రోహిత్ శర్మ ప్రత్యేకంగా ఇప్పుడు నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. కానీ అతడిపై వస్తోన్న పుకార్లు, విమర్శలకు బ్యాట్‌తోనూ సమాధానం చెప్పాడు. తన సెంచరీతో అందరి నోళ్లు మూయించాడు. అయినా ఇలాంటి పుకార్లు వస్తే కొన్నిసార్లు ఇబ్బందిగా ఉంటుంది. అతడికి ఇంకా ఆడాలనే కోరిక, ఆటపై ఆసక్తి, కష్టపడే తపన ఉంటే.. ఎంతకాలం కావాలంటే అంతకాలం ఆడే అవకాశం ఇవ్వాలి. ఒక రోజు రోహిత్ స్వయంగా జట్టును వీడేందుకు సరైన సమయం ఇదేనంటూ భావిస్తాడు. అప్పుడు మాత్రమే అతడు రిటైర్‌మెంట్ ఇవ్వాలి. ఇలాంటి నాణ్యమైన ఆటగాడిని జట్టు నుంచి తప్పించాలనుకునే సమయంలో అతడు ఇలాంటి ఇన్నింగ్స్ ఆడటం ప్రత్యేకం. లార్డ్స్‌లో వచ్చిన ఈ వన్డే సెంచరీ చాలా గొప్పది' అని శాస్త్రి ప్రశంసించాడు.


## ఫిఫా విజేతలకు భారీ జాక్‌పాట్.. స్పెయిన్ ప్లేయర్లకు రూ.8.32 కోట్ల చొప్పున బోనస్!




ఇంటర్నెట్ డెస్క్:

ఫిఫా ప్రపంచ కప్ 2026 విజేతగా నిలిచిన స్పెయిన్ జట్టుకు భారీ జాక్‌పాట్ తగిలింది. జట్టులోని ప్రతి ప్లేయర్‌కు 7.56 లక్షల యూరోలు(సుమారు రూ.8.32 కోట్లు) బోనస్‌గా అందనున్నట్లు స్పానిష్ మీడియా వెల్లడించింది. ఫిఫా ఫైనల్‌లో అర్జెంటీనా జట్టుపై 1-0 తేడాతో గెలిచిన స్పెయిన్.. రెండోసారి ట్రోఫీని ముద్దాడిన సంగతి తెలిసిందే. ప్రపంచ కప్ విజేతగా నిలవడంతో ఫిఫా నుంచి స్పానిష్ ఫుట్‌బాల్ సమాఖ్యకు 50 మిలియన్ డాలర్ల(రూ.481 కోట్లు) ప్రైజ్ మనీ లభించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా ప్రపంచ ఛాంపియన్ హోదాతో స్పాన్సర్‌షిప్ ఆదాయం, టెలివిజన్ ప్రసార హక్కుల విలువ కూడా గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం స్పెయిన్ జాతీయ జట్టుకు ప్రయాణం, బీమా, టెలికమ్యూనికేషన్, క్రీడా సామగ్రి, ఇంధనం, ఆహార, పానీయాల వంటి రంగాలకు చెందిన 35 సంస్థలు స్పాన్సర్లుగా ఉన్నాయి. ప్రపంచకప్ విజయంతో వీటి విలువ మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఇక జట్టు అధికారిక జెర్సీల అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. ముఖ్యంగా స్పెయిన్ జెర్సీలు దేశవ్యాప్తంగా పూర్తిగా విక్రయాలు చేసినట్లు సమాచారం. విదేశాల్లోనూ వీటి డిమాండ్ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రైజ్ మనీతో పాటు ప్రతి ఆటగాడికి ప్రపంచ కప్ విజేత పతకం, ప్రత్యేక రింగ్ కూడా అందజేయనున్నారు.

# ‘టాక్సిక్’ నుంచి రెండో పాట
# యశ్-తారా రొమాన్స్‌తో ‘మనసు ఆగదు’!




రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘టాక్సిక్’ విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట ‘మనసు ఆగదే’ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట ‘తబాహి’తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు. ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.




## సరికొత్త బిజినెస్ ప్రారంభించిన నటి సాక్షి అగర్వాల్!



దక్షిణాది సినీ పరిశ్రమలో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాక్షి అగర్వాల్, ఇప్పుడు వ్యాపార రంగంలోకి అడుగుపెడుతూ తన ఐదేళ్ల కలను నిజం చేసుకున్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని ‘ఓకూ’ పేరుతో ఒక ప్రీమియం పెర్ఫార్మెన్స్ న్యూట్రిషన్ కంపెనీని ఆమె అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి లోనైన సాక్షి, ఈ బ్రాండ్ రూపుదిద్దుకోవడానికి తాను గత ఐదేళ్లుగా నిరంతరం పరిశోధనలు చేస్తూ, ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అత్యుత్తమ నాణ్యత కలిగిన పోషకాహార ఉత్పత్తులను అందించడమే తన ప్రధాన ధ్యేయమని ఆమె తెలిపారు. మార్కెట్లో చాలా న్యూట్రిషన్ బ్రాండ్లకు సినీ ప్రముఖులు కేవలం అంబాసిడర్లుగా మాత్రమే పరిమితమవుతారని, కానీ తాను శ్రమించి స్థాపించిన ఈ సంస్థకు తానే స్వయంగా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం ఎంతో గర్వంగా ఉందన్నారు. వరుస షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతోనే ఈ సంస్థను ప్రారంభించినట్లు వివరించారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, తమిళంలో ‘రాజా రాణి’, ‘కాలా’, ‘విశ్వాసం’, ‘సింద్రెల్లా’, ‘టెడ్డి’, ‘అరణ్మనై 3’ వంటి హిట్ సినిమాల్లో నటించి, ‘బిగ్‌బాస్ తమిళ్’ ద్వారా విశేష ప్రజాదరణ పొందిన సాక్షి, ఇప్పుడు బిజినెస్ ఉమెన్‌గా కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. నటిగా అలరిస్తూనే వ్యాపారవేత్తగా కూడా విజయం సాధించాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## ఐశ్వర్యలో ఆ అణకువే నచ్చుతుంది
## జయా బచ్చన్ పాత వ్యాఖ్యలు వైరల్

బాలీవుడ్ నటి, మాజీ విశ్వసుందరి ఐశ్వర్య రాయ్ బచ్చన్‌పై ఆమె అత్త, సీనియర్ నటి జయా బచ్చన్ గతంలో కురిపించిన ప్రశంసలు మరోసారి వార్తల్లో నిలిచాయి. తన కోడలు ఐశ్వర్య తమ కుటుంబంలో ఎంత అన్యోన్యంగా కలిసిపోయారో, అంతటి స్టార్‌డమ్ ఉన్నప్పటికీ ఆమె ఎంతటి అణకువతో ఉంటారో జయా బచ్చన్ ఒక సందర్భంలో వివరించారు. దీనికి సంబంధించిన పాత వీడియో క్లిప్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కరణ్ జోహార్ నిర్వహించే ప్రముఖ చాట్ షో ‘కాఫీ విత్ కరణ్’లో పాల్గొన్న సందర్భంగా జయా బచ్చన్ ఈ వ్యాఖ్యలు చేశారు. “ఐశ్వర్య చాలా మంచి మనసున్న వ్యక్తి. ఆమెకు నా పట్ల ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయి. తను కూడా పెద్ద స్టార్ అయినప్పటికీ, మేమంతా కలిసి ఉన్నప్పుడు ఎప్పుడూ తన హోదాను ప్రదర్శించుకోదు. ఎంతో హుందాగా ఉంటూ, ఇతరుల మాటలను నిశ్శబ్దంగా వింటుంది. ఆమెలోని ఈ గుణం నాకు ఎంతగానో నచ్చుతుంది,” అని జయ కొనియాడారు. కేవలం కుటుంబ సభ్యులతోనే కాకుండా, తమ స్నేహితులతో కూడా ఐశ్వర్య ఎంతో సాన్నిహిత్యంగా మెలుగుతారని జయ ఆనందం వ్యక్తం చేశారు. ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్‌ల వివాహం 2007 ఏప్రిల్ 20న జరిగిన విషయం తెలిసిందే. వీరికి 2011లో ఆరాధ్య అనే కుమార్తె జన్మించింది. ‘కుచ్ నా కహో’, ‘ధూమ్ 2’, ‘గురు’, ‘రావణ్’ వంటి పలు చిత్రాల్లో అభిషేక్, ఐశ్వర్య కలిసి నటించారు.



## చరణ్ సరసన రష్మిక?- సుకుమార్ స్కెచ్ మామూలుగా లేదుగా!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం ‘ఆర్‌సీ17’ (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన ‘రంగస్థలం’ ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో ‘పుష్ప’ ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ‘పుష్ప’ సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు ‘ఆర్‌సీ17’ కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది. చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ‘రంగస్థలం’తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి ‘రణబాలి’ అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. ‘గీత గోవిందం’, ‘డియర్ కామ్రేడ్’ తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.





Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449